# ఆంధ్రజ్యోతి







వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మంత్రి తుమ్మల

## వైద్య కళాశాల పనులు వేగవంతం చేయండి

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి
- జ్వరాల నియంత్రణ కోసం పీహెచ్‌సీల్లో సేవలు పెంచండి
- వైద్య,ఆరోగ్య శాఖ మంత్రితో మంత్రి తుమ్మల భేటీ

ఖమ్మం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరంలో కొత్తగా నిర్మించబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల పనులు వేగవంతంగా చేపట్టాలని, అలాగే ఖమ్మం ఆసుపత్రితో పాటు జిల్లాలోని ఇతర పీహెచ్‌సీలోని సమస్యలు పరిష్కరించడం, వైద్యులను నియమించాలని, వైద్యారోగ్యసేవలను మరింతగా పెంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు... వైద్యారోగ్యాశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులో వైద్యారోగ్యశాఖ మంత్రి చాంబర్‌లో శుక్రవారం భేటీ అయి పలు సమస్యలపై చర్చించారు.

ఖమ్మం మెడికల్ కాలేజీకి 35 ఎకరాల స్థలం కేటాయింపు, రూ.133కోట్ల నిధుల మంజూరుతో టెండర్లు పూర్తయినందున మెడికల్ కళాశాల భవనాల పనులు ప్రారంభించి వేగంగా పూర్తిచేయాలని సూచించారు. 600 పడకలతో అధునాతన సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలోనే మోడల్‌గా ఖమ్మం మెడికల్ కాలేజీ నిర్మాణం జరగబోతున్నందున ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి తుమ్మల సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలోనే మెడికల్ కళాశాలలో తరగతులు కొత్తకాలేజీలో బోధించేలా చూడాలని కొత్తమెడికల్ కాలేజీలో అన్ని విభాగాలు సూపర్‌స్పెషాలిటీ స్థాయిలో వైద్యసేవలందేలా ఒక క్రమపద్ధతిలో విభాగాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

అలాగే ఖమ్మంలోని ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య పరికరాలను 50 బెడ్ల ఐసీయూ, ల్యాప్రోస్కోపిక్ సెట్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రే, వాటర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రస్తుతం డెంగీతో పాటు ఇతర సీజనల్ జ్వరాలు, వ్యాధులు పెరుగుతున్నందున డాక్టర్ల సంఖ్యను పెంచాలని, ప్రస్తుతం ఉన్న డాక్టర్ల సంఖ్య సరిపోవడం లేదని తుమ్మల వివరించారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌళిక సదుపాయాలు కల్పించి ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని కోరారు. అందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ సానుకూలంగా స్పందించి ఖమ్మం మెడికల్ కళాశాల పనులను వేగవంతంగా పూర్తిచేయిస్తామని, జిల్లాలో అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించి, డాక్టర్ల కొరత తీరుస్తామని హామీ ఇచ్చారు.



ఖమ్మంలో నిర్మించనున్న మెడికల్ కళాశాల భవన నమూనా

---

ఖమ్మం ఆర్‌టీఏ పరిధిలో వాహనాల దొంగ రిజిస్ట్రేషన్ల వ్యవహారం దర్జాగా కొనసాగుతోంది. ప్రైవేటు ఫైనాన్స్‌లకు ఈఎంఐలు చెల్లించని వాహనాల విషయంలో ఈ బాగోతం చోటుచేసుకుంటోందని సమాచారం. పలు దొంగ వాహనాలకు సైతం దర్జాగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వాహనం కొట్టుకొచ్చిందా, కొనుక్కొచ్చిందా అనేది సంబంధం లేకుండా ఆర్‌సీ కార్డుల్లో ఫొటోలు మార్చి వాహనాలను జిల్లాలు దాటించేస్తున్నారు. యజమాని ఎవరు, డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా అన్న విషయాన్ని పక్కనపెట్టి మామూళ్లు ముట్టజెప్పిన వారికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.



# ఆర్టీఏలో మాయ

- అసలు యజమాని స్థానంలో మరొకరి ఫొటో
- ట్యాక్స్, ఆధార్, ఇన్సూరెన్స్ అన్నీ మార్ఫింగే..
- వాహనాల ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారులతో లింకులు
- దర్జాగా వాహనాల దొంగ రిజిస్ట్రేషన్ల దందా

ఖమ్మం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గంగబండ తండాకు చెందిన బి.లక్ష్మణ్ 2022లో ద్విచక్ర వాహనం (టీఎస్ 04ఎఫ్‌జె 1503) కొనుగోలు చేశాడు. ఆ వాహనం అనేకమంది చేతులు మారింది. ప్రస్తుతం ఆ వాహనం ఆయన పేరుమీదనే ఉండగా.. లక్ష్మణ్ ఫొటో ఉండాల్సిన స్థానంలో వేరెవారి ఫొటో కనిపిస్తోంది.

● రఘునాథపాలెం మండలం పాపటపల్లి జీకె బంజరకు చెందిన బి.వీరన్న (టీఎస్ 04ఎఫ్ఏ 1960) ఆర్‌సీ కార్డులో, నేలకొండపల్లి మండలానికి చెందిన వడ్లమూడి రాజ (టీఎస్04ఎఫ్ఈ5082) ఆర్‌సీ కార్డులో వేరే వారి ఫొటోలు ఉన్నాయి. ఈ వాహనాలను వేరే జిల్లాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇవి కేవలం ఒక్కరోజులో 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కినవి మాత్రమే..



CERTIFICATE OF REGISTRATION
Regn. Number : TS04FA1960
Regd. Owner : B VEERANNA
BANOTHU BHICHA
Address : 5-1
GK BANJARA
PAPATAPALLI
RAGHUNADHAPALEM-507003
Maker's Class : CBSHINEWF&RDRMBWCBSKIKSTI
Vehicle Class : MOTOR CYCLE
Mth. Yr. of Mfg : 9/2015
Fuel Used : PETROL

రఘునాథపాలెం మండలం పాపటపల్లి జీకే బంజరకు చెందిన వీరన్న ఒరిజనల్ ఆర్‌సీ

### మార్ఫింగ్‌లో దిట్టలు..

వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయాలన్నా, దానిని ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు బదిలీ చేయాలన్నా, ఫైనాన్స్ ఉన్నట్టు నమోదు చేయాలన్నా, తీసేయాలన్నా దానికి ఆయా వాహనాల యజమానులు అవసరం. కానీ ఖమ్మం ఆర్‌టీఏలో మాత్రం యజమాని లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు చేసి ఎన్‌వోసీలు ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, మోటారు వాహన ట్యాక్స్, పొల్యూషన్ సర్టిఫికేట్, పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉండగా మార్ఫింగ్ చేస్తున్నారు. అసలు యజమానికి బదులుగా మరెవరో వ్యక్తిని నిల్చోబెట్టి ఫొటోలు దింపుతున్నారు.



M-Wallet
Govt. Of Telangana Transport Department
TELANGANA STATE TRANSPORT DEPARTMENT
Regn. Number : TS04FA1960
Regd. Owner : B VEERANNA
Address : 5-1, GK BANJARA, PAPATAPALLI
Maker's Class : CBSHINEWFRDRMBWC BSKIKSTRTESTRTWCAS
Vehicle Class : MOTOR CYCLE
Fuel Used : PETROL

అదే నెంబరుగల వాహనానికి సంబంధించి వీరన్న స్థానంలో మరో వ్యక్తి ఫొటో ఉన్న దృశ్యం

### అసలు పత్రాలు లేకున్నా నో ఆబ్జెక్షన్

### ఒక్కో వాహనానికి రూ. 10వేలు...

ఏజెంట్లు అధికారులతో ముందస్తుగా ఒప్పందాలు చేసుకుని నకిలీ కార్డులు, పత్రాలను సమర్పిస్తున్నారు. ఆర్‌సీ కార్డులో మార్ఫింగ్ చేసిన ఫొటో ఉన్న వ్యక్తిని అధికారుల దగ్గరకు పంపుతున్నారు. కరెన్సీ వాసన తగిలిన సదరు అధికారి పత్రాలనేమీ పట్టించుకోకుండా అసలు యజమాని స్థానంలో వేరెవరినో ఫొటో వేరే జిల్లాకు వాహనం క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. ఈ తతంగాన్ని నడిపినందుకుగాను ఒక్కో వాహనానికి రూ.5 నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. కొవిడ్ సమయంలో టీఆర్ వాహనాలకు, దొంగ వాహనాలకు సైతం ఇదే రీతిలో రిజిస్ట్రేషన్లు చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారులతో లింకులు...

జిల్లాలో సుమారు 150 వరకు టూ వీలర్, ఆటో ఫైనాన్స్ కంపెనీలు ఉండగా.. వాటిల్లో కేవలం 30 నుంచి 40 శాతం మంది మాత్రమే నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నారు. చేసే వ్యాపారంలో కేవలం 20శాతం మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు ఆర్టీఏ ఏజెంట్లతో లింకులు ఏర్పాటు చేసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ల వ్యవహారం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. వాయిదాలు చెల్లించని ఫైనాన్స్ వాహనాలను ఇతరులకు అంటగట్టడానికి కూడా నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారు.

### వేటు పడినా ఆగని దందా...

దొంగ క్లియరెన్స్, రిజిస్ట్రేషన్ల దందాలో పోలీస్ క్లియరెన్సు సర్టిఫికెట్లు కీలకం. ఆర్‌టీఏ ఏజెంట్లు పోలీస్ స్టేషన్లలోని టెక్నికల్ టీం ఆపరేటర్లు, రైటర్లతో ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను అప్రూవల్ చేయించుకుంటున్నారు. ఈక్రమంలోనే కొద్ది రోజుల క్రితం ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. అయినా ఈ దందాకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు.

---

## విద్యార్థినితో అసభ్యకర ప్రవర్తన

- తెలుగు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు
- విధుల నుంచి సస్పెన్షన్.. కొత్తగూడెంలో కలకలం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 23: విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు, విధుల నుంచి తొలగించారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తగూడెంలో ప్రతీ రోజు మాదిరిగానే శుక్రవారం కూడా పాఠశాలకు వెళ్లేందుకు 12 ఏళ్ల వయస్సు గల 7వ తరగతి విద్యార్థిని సిద్ధమైంది. ఈ క్రమంలో తల్లిదండ్రులను చూసి బోరున విలపించింది. ఏమైందని కుటుంబ సభ్యులు ఆరా తీయగా... వారం రోజులుగా పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వేణు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపింది. ఇష్టమొచ్చినట్లు గిచ్చుతూ... గిల్లుతూ... ఇతర శరీర భాగాలను తాకుతున్నాడని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విద్యార్థిని చదువుకునే కొత్తగూడెంలోని పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయిసుజాతకు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయుడిని తమకు అప్పగించాలని ఆందోళన కొనసాగించారు. దీంతో పాఠశాల సిబ్బంది కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఆందోళనకారులతో, ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడారు. ఈ క్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు వేణును వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విద్యార్థిని వాఙ్మూలం తీసుకొని విచారించిన పోలీసులు తెలుగు ఉపాధ్యాయుడు వేణుపై పోక్సో కేసు నమోదు చేశారు. పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించగా ఉపాధ్యాయుడు వేణును సస్పెండ్ ఉత్తర్వులను జారీ చేశారు.

---

## శ్రీమద్భాగవత సప్తాహం ప్రారంభం

- సంప్రదాయబద్ధంగా అంకురార్పణ
- 30 వరకు సాగనున్న కార్యక్రమాలు
- భాగవతంతోనే మోక్షం
- ప్రవచనంలో అహోబిల రామానుజ జీయర్‌స్వామి

భద్రాచలం, ఆగస్టు 23: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత నవమ సప్తాహం శుక్రవారం ప్రారంభమైంది. ముందుగా స్థానిక చిత్రకూట మండపంలో అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఉత్సవానుజ్ఞ తీసుకొని విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక్‌వరణంతోపాటు అంకురార్పణను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.అనంతరం వాస్తుహోమం మండపారాధనం చేశారు. గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు శ్రీమద్భాగవత సప్తాహం సాగనుంది. అంతకు ముందు అహోబిల రామానుజ జీయర్‌స్వామి భద్రాద్రి రామయ్య దర్శనం కోసం రాగా దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు.

### భాగవతంతోనే మోక్షం లభిస్తుంది.

పాలలో సారం నెయ్యి ఎలాగో వేదసారం భాగవతమని, దాంతోనే మోక్షం లభిస్తుందని అహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. భద్రాచలంలోని చిత్రకూట మండపంలో శ్రీమద్భాగవత సప్తాహంలో భాగంగా ఈసారి ప్రవచనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తి ఉంటేనే భాగవతం తెలుస్తుందని రామాయణానికి భక్తియుక్తి ఉండాలన్నారు. భగవంతుని గురించి చెప్పేదే భాగవతమని రామాయణం 24వేల శ్లోకాలతో ఉంటే భాగవతం 12 స్కందాలతో ఉంటుందన్నారు. కథలన్నీ నైమిషారణ్యంలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. రాముని చరిత్ర చెబుతుంది కాబట్టే రామాయణం అయ్యిందని రామాయణంలో సీతారాములకు సమ ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రస్తుత కలియుగంలో అంతా స్వార్ధచింతన వీడి భక్తి మార్గాన్ని అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు కేతఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదానాచార్యులు, వేద పండితులు కె.కామేశ్వరశర్మ పాల్గొన్నారు. కాగా, శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం రామాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

---

## మున్నేరు వంతెనపై భారీ వాహనాల నిషేధం




అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఖమ్మం రూరల్, ఆగస్టు 23: మున్నేరుపై ఉన్న పాత వంతెనపై నుంచి భారీ వాహనాలు, బస్సుల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్-ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతాల మధ్య మున్నేరు వంతెన పక్కనే తీగల వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా రహదారిపై బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. రహదారి ఇరుకుగా ఉంది. జలగంనగర్ ఆంజనేయస్వామి ఆలయం దగ్గర తీగల వంతెనకు సంబంధించిన పిల్లర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భారీ వాహనాలు, బస్సుల రాకపోకల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు వాటి రాకపోకలను నిలిపివేస్తూ నాయుడుపేట బైపాస్ రోడ్డు, ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

---

## అండగా ఉండే కొడుకు అసువులు బాశాడు..

- అనకాపల్లి ఘటనలో పేట వాసి మృతి
- గంగారం గ్రామంలో విషాదఛాయలు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: ఒక్కగానొక్క కొడుకు.. కుటుంబానికి ఆధారం అతనే.. రెండు రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించి కుటుంబానికి ఆధారంగా ఉన్న సమయంలో ఊహించని విధంగా జరిగిన ఘటనలో ఆ కుటుంబ మొత్తం ఆధారాన్నే కోల్పోయింది. ఆంధ్రాలోని అనకాపల్లి సెజ్ ఘటనలో అశ్వారావుపేట మండలానికి ఒకరు మృతిచెందగా గురువారం రాత్రి అంత్యక్రియలు పూర్తిచేశారు.

మండలంలోని ఊట్లపల్లి పంచాయతీలోని గంగారం గ్రామానికి చెందిన మార్ని కృష్ణారావు, జముల దంపతుల ఏకైక కుమారుడు సురేంద్ర(37). తండ్రి చిన్నతనంలోనే మరణించటంతో తల్లి జమున సురేంద్రను ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) వరకు చదివించింది. విద్యాభ్యాసం అనంతరం సురేంద్ర గత తొమ్మిదేళ్లుగా గాజువాకలో ఉంటూ అనకాపల్లిలోని ఫార్మాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధురాలైన తల్లి స్వగ్రామం గంగారంలోనే ఉంటోంది. రోజువారిలాగే బుధవారం కూడా పరిశ్రమకు బయలుదేరేముందు తల్లికి ఫోన్‌చేసి రెండు రోజుల్లో వస్తానని తెలిపాడు. అనంతరం పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో సురేంద్ర దుర్మరణం చెందాడు. ఘటన అనంతరం గురువారం రాత్రి మృతదేహాన్ని గంగారం తీసుకురాగా అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడు సురేంద్రకు భార్య గీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే సురేంద్ర మృతితో గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి.



మార్ని సురేంద్ర (ఫైల్)

---

## రెండు రూపాయల రుణమాఫీ

- అవాక్కైన రైతు... నిబంధనల ప్రకారమే అన్న అధికారులు
- రుణం ముందుగా చెల్లించడంతో వర్తించని రుణమాఫీ
- న్యాయం చేయాలంటున్న రైతు

6



రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం. "రైతు ఋణ మాఫీ - 2024" క్రింద శ్రీ Ambati Rajes గారు,రూ2/- బ్యాంక్ ఖాతా నంబర్ XXXXXX0002 DCCB CHINTHAKANI బ్రాంచ్ యందు తేది 30.07.2024 న జమ చేయబడినది. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని/మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు. మీ ఈ ఆనందంలో పాలుపంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

మీ ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.

రైతు సెల్‌కు వచ్చిన మెసేజ్

---

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మంమార్కెట్, ఆగస్టు 23: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి ఈనెల 26 వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24, 25 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కాగా 26 సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి పండుగను పురస్కరించుకొని సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 27 మంగళవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

---

## 'శిథిలం'తో చెలగాటం

### జిల్లాలో అవసాన దశకు పలు హాస్టల్ భవనాలు

**అవన్నీ దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు.. ప్రస్తుతం వాటి జీవిత కాలం పూర్తవ్వడంతో పాటు నిర్వహణ సరిగా లేకపోవడంతో పైకప్పుల పెచ్చులు ఊడిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అలాంటి భవనాల్లోనే అనేక మంది విద్యార్థులు నివాసం ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందే ఆయా భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి నెలకొంది.**



వీవీపాలెంలో శిథిలావస్థలో ఉన్న బీసీ హాస్టల్ భవనం

- పెచ్చులు ఊడుతున్న భవనాల పైకప్పులు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విద్యార్థులు
- కూల్చేయాలని చెబుతున్నా స్పందించని ఇంజనీరింగ్ విభాగాలు
- ప్రతిపాదనలకే పరిమితమైన కొత్త భవనాల నిర్మాణం

ఖమ్మం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొన్ని నెలల క్రితం ఖమ్మం నగరంలోని లైబ్రరీ భవనం ఆకస్మాత్తుగా కూలిపోయింది. అయితే ఆ రోజు లైబ్రరీకి సెలవుదినం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అదే పనిరోజుల్లో ఆ భవనం కూలి ఉంటే ఊహించని ప్రాణనష్టం జరిగి ఉండేది. కుప్పకూలిన ఆ లైబ్రరీ భవనాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆనాటి ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాతభవనాలు, నిరుపయోగంగా ఉంటున్న ప్రభుత్వ భవనాలను కూల్చివేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో శిథిలావస్థకు చేరిన భవనాలకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల నుంచి నివేదికలు సమర్పించారు. ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఆయా భవనాలను కూల్చివేసి నూతన భవనాలను నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ నేటికీ ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇంతవరకు పాత భవనాలను కూల్చలేదు. కొత్తవి నిర్మించలేదు. కనీసం అత్యవసరమైన చోట ప్రైవేటు భవనాల్లోకి మార్చడం వంటి చర్యలు కూడా చేపట్టకపోవడం గమనార్హం.

### శిథిలావస్థలో హాస్టల్ భవనాలు..

జిల్లాలో పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ముఖ్యంగా జిల్లాలో బీసీ సంక్షేమశాఖకు సంబం.

(మిగతా 6వ పేజీలో)

నాసిరకం విత్తనాలతో నారు పోస్తే..

# ఏడాది జైలు, జరిమానా

» జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూధన్



నర్సరీని తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 23: నర్సరీ నియమ నిబంధనలు పాటించకుండా నాసిరకం విత్తనాలతో నారుపోస్తే రూ.50వేలజరిమానా, ఏడాది జైలు శిక్షణ విధించడంతో పాటు, నర్సరీ లైసెన్సును శాశ్వతంగా రద్దు చేస్తామని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూధన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మధిర మండలంలోని పలు మిరప నర్సరీలను తనిఖీ చేసి జిల్లాలోని నర్సరీ యజమానులకు పలు సూచనలు చేశారు.ప్రభుత్వ ఆమోదం పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ సూచించారు. నర్సరీలలో పలు మేలైన యాజమాన్య పద్ధతులు, సూచనలు నర్సరీ చట్టం ప్రకారం నియమ నిబంధనలు పాటించాలన్నారు. రైతుల అంగీకారం తెలిపిన రకాలను, పేరు గాంచిన రకాలను, వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారు పెంచాలన్నారు. రైతుకు సంబంధించిన విత్తనాలు, విత్తిన వాటికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు.

# పీహెచ్‌సీలకు సుస్తీ..

» బదిలీలతో వేధిస్తున్న సిబ్బంది కొరత

» విజృంభించిన వ్యాధులు.. అల్లాడుతున్న గిరిజనం

» ఆసుపత్రిలో వైద్యులు..క్షేత్రస్థాయిలో పర్యవేక్షులు లేక ఇబ్బందులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: అశ్వారావుపేట గిరిజన ప్రాంతంలో వానాకాలం వచ్చిందంటే ప్రజలు వ్యాధులతో అల్లాడుతున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక అల్లాడుతున్న వినాయకపురం పీహెచ్‌సీని తాజాగా జరిగిన బదిలీలు మరింతగా కుంగదీశాయి. ఫలితంగా క్షేత్రస్థాయిలో వైద్యం అందించే వైద్యసిబ్బందే పూర్తిగా లేకుండా పోయారు. మండలంలో వినాయకపురం, గుమ్మడివల్లి ప్రభుత్వ పీహెచ్‌సీలు ఉన్నాయి. గుమ్మడివల్లి పీహెచ్‌సీ 24గంటల పాటు సేవలందించే ఆసుపత్రి అయినా ఇక్కడ సేవలు అంతంత మాత్రంగానే ఉంటాయి.

మండలంలో 16 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలో 12 సబ్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీ పరిధిలో దాదాపు 45వేల మంది జనాభా ఉన్నారు. దీని పరిధిలోనే కొండరెడ్ల గ్రామాలు, మలేరియా పీడిత గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 12 గ్రామాలు మలేరియా పీడిత గ్రామాలు ఉన్నాయంటేనే ఇక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు. ఈవైద్యశాలకు పూర్తిస్థాయి సిబ్బంది ఎంతో అవసరం. ప్రధానంగా ఏఎన్‌ఎం, రెండో ఏఎన్‌ఎంలు, ఇతర పర్యవేక్షకులు తప్పనిసరిగా ఉండాలి. కాని రెండుమూడు చోట్ల ఏళ్ల తరబడి ఏఎన్‌ఎంలు లేకపోగా తాజాగా జరిగిన బదిలీల్లో మరింత మంది ఇతర ప్రాంతాలకు వెళ్లగా పీహెచ్‌సీ పరిస్థితి దారుణంగా మారింది. బదిల్లో మొత్తం 11మంది వెళితే ముగ్గురు మాత్రమే వచ్చారు. కొద్దిరోజుల క్రితం ఇక్కడ ఉన్న ఒక వైద్యుడిని ములకలపల్లి మండలానికి డిప్యూటేషన్‌పై పంపారు. అసలే వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతుంటే ఉన్న ఒక్క వైద్యుడితో ఎలా సేవలు సాగుతాయోనని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ సబ్‌యూనిట్ అధికారి, హెచ్‌ఈవో, హెల్త్ సూపర్‌వైజర్ ముగ్గురూ ఇతర ప్రాంతాలకు బదిలీకాగా ఇతర ప్రాంతాల నుంచి ఒక్కహెచ్‌ఈవో రాగా మిగిలిన రెండు పోస్టుల్లో ఖాళీగానే ఉన్నాయి.

అశ్వారావుపేట-1, రూరల్, నారంవారిగూడెం, వేదాంతపురం మొదటి ఏఎన్‌ఎం పోస్టులు బదిలీల వల్ల ఖాళీ అయ్యాయి. వీటిలో కొన్నిచోట్ల రెండో ఏఎన్‌ఎంలు కూడా లేరు. అంటే ఇక్కడ ఆశాకార్యకర్తలే దిక్కుగా ఉంటారు. ఇవి కాక మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేట-3 మొదటి ఏఎన్‌ఎం పోస్టులు గడిచిన పదేళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి. ఇక్కడ రెండో ఏఎన్‌ఎంలు అన్నీ అయి పనులు చేస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 12 ఆరోగ్య ఉప కేంద్రాలకుగాను ఆరు ఉప కేంద్రాలకు మొదటి ఏఎన్‌ఎంలే లేరు. అశ్వారావుపేట రూరల్, అశ్వారావుపేట-3, నందిపాడు, వేదాంతపురం ఆరోగ్య ఉపకేంద్రాల్లో రెండో ఏఎన్‌ఎంలే లేరు. పీహెచ్‌సీలో ఉండే స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టు పోస్టులు బదిలీల వలన ఖాళీగా మారాయి. తద్వారా ఇక్కడ సేవలు అంతంత మాత్రమే అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వీటితో పాటు దాదాపు ఆరు చోట్ల ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



గోపన్నగూడెంలో జ్వరంతో బాధపడుతున్న మహిళ





వినాయకపురం పీహెచ్‌సీ

**రోగాలతో అల్లాడుతున్న జనం**

అశ్వారావుపేట మండలంలో ఏ గ్రామాన్ని కదిలించినా వందల్లో రోగులు ఉన్నారు. రెడ్డిగూడెం, బండారుగుంపు, దురదపాడు, దిబ్బగూడెం, మొద్దులమడ, గాడ్రాల ఇలా ఏ గిరిజన గ్రామానికి వెళ్లినా మలేరియా, టైఫాయిడ్ బాధితులు ప్రతి ఇంట్లో కనిపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు ఆయా గ్రామాల్లోనే పూర్తిస్థాయిలో వైద్యం అందించాలి. అందుకు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేయాలి.



**సిబ్బంది లేక ఇబ్బందిగానే ఉంటుంది..**

**డాక్టర్ రాందాస్, పీహెచ్‌సీ వినాయకపురం**

ఆసుపత్రిలో, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవటం చాలా ఇబ్బందిగానే ఉంటుంది. బదిలీల్లో 11మంది వెళితే ఇద్దరు మాత్రం వచ్చారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరిగింది. గ్రామాల్లో వ్యాధుల నియంత్రణకు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేస్తూనే ఉన్నాం.

# పశుగణనను పకడ్బందీగా చేపట్టాలి

» అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 23: జిల్లాలో పశుగణనను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. 21వ జాతీయ పశుగణనను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 21వ అఖిల భారత పశుగణన 1 సెప్టెంబరు, 2024 నుంచి 31 డిసెంబరు, 2024 వరకు చేపట్టి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 589 గ్రామ పంచాయతీలలో, 4 పట్టణ ప్రాంతాలు కలిపి మొత్తం 999 ఆవాస ప్రాంతాల్లో సమగ్ర పశుగణన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను 380 రెవెన్యూ గ్రామాలకు 150 మంది ఎన్యుమరేటర్లు, 40 మంది సూపర్వైజర్లను నియమించినట్లు ఆయన అన్నారు.

పశుగణన ఎంతో కీలకమైనదని, సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి, డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయాలన్నారు. పశువుల గణన సరైన ప్రణాళిక, పశుసంక్షేమ కార్యక్రమాలను రూపొందించడానికి, ఈ రంగంలో మరింత అభివృద్ధి ని సాధించడానికి ఈ ప్రధాన సమాచారం మూలమని అన్నారు. దీనివలన పూర్తిస్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు, పశువులకు సంబంధించిన మందులు ప్రభుత్వం సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. పాడి రైతులకు సంక్షేమ పథకాలు అమలుచేయడానికి ప్రభుత్వానికి ఖచ్చితమైన అవగాహన కల్గుతుందన్నారు. శిక్షణ ను సద్వినియోగం చేసుకొని పశుగణన ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు.

జిల్లా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డా. బి. వేణుమనోహరరావు మాట్లాడుతూ, చివరి పశుగణన అంటే 20వ పశుగణన 2019 లో నిర్వహించినట్లు, వచ్చే సెప్టెంబర్ నుండి 21వ పశుగణన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, ఇతర పశువుల వివరాలను సేకరిస్తారని తెలిపారు. పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు ఎన్యుమరేటర్లకు వివరాలు తెలియజేసి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డా. సుబ్బారావు, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డేటా సేకరణ, పశుజాతులు, గణన పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అధికారులు డాక్టర్. రాధాకిషన్, డాక్టర్. శ్రీరమణి, డాక్టర్. అరుణ, డాక్టర్. రాజు, పశువైద్యులు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల ప్రేమ ఉన్నట్లు

# గుండెలు బాదుకుంటున్న బీఆర్ఎస్

» గత ప్రభుత్వం తప్పిదాల వల్లనే సమస్యలు

» సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు23: రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ రైతుల పట్ల ప్రేమ ఉన్నట్లు గుండెలు బాదుకుంటున్నారని, ఈ డ్రామాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో చేయలేనివి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఈ 8నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ చేసి చూపిస్తుందని, హామీలు నెరవేరుతుంటే ప్రోత్సహించాల్సింది పోయి కడుపు మంటతో అక్కసుతో మంచి పేరుతో వస్తుందనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ అసభ్య ప్రచారాలు, రంధ్రాన్వేషణ చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పార్టీలు మారేందుకు ఆద్యులే అని, పార్టీ వద్దనుకుని మమ్మల్ని పక్కన పెట్టినందువల్లనే ప్రజాసేవ కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరామని గుర్తుచేశారు. సీతారామ ప్రాజెక్టు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ స్థితిలో ఉందో అందరికీ తెలుసు అని, దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను సీతారామాగా పేర్లుమార్చి కమీషన్ల కోసం రీడిజైన్ పేరుతో రూ.18వేల కోట్లు పెంచిన బీఆర్ఎస్ ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేకపోయిందని, రన్నింగ్‌లో లేక పంప్‌హౌస్‌లు, మోటార్లు తుప్పుపట్టడంతో పాటు బిల్లులు రూ.లక్షల్లో పెరిగిపోయాయని, ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశ్యంతో మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిలు తక్కువ ఖర్చుతో పూర్తిచేసి ఆల్టర్‌నేట్ కెనాల్‌ను వైరా వరకు నిర్మించి ఇటీవలే ప్రారంభించుకున్నామన్నారు. అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారని, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని తట్టుకోలేకపోతున్నారు.

వేసవిలో ప్రజలు తాగేందుకు నీళ్ల లేవని, సాగునీరు లేక పంటపొలాలు ఎండిపోయాయని, క్రాప్ హాలీడే ప్రకటించడం కూడా గత ప్రభుత్వం వైఫల్యాలేనన్నారు. రుణమాఫీ రూ.2లక్షల వరకు కుటుంబ ప్రాతిపదికన ఇస్తామని, అనర్హులకు పథకాలు అందకూడదనే ఉద్దేశ్యంతో శాస్త్రీయంగా చేయాల్సిన అవసరం ఉందని, 29సాంకేతిక సమస్యలు వచ్చాయని, ఇంటింటికి సర్వేతో పాటు అధికారులు అందుబాటులో ఉంటూ పరిశీలిస్తున్నారని, 10-15రోజులల్లో ఖచ్చితంగా అర్హులందరికీ రుణమాఫీ అమలవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ఏ నమ్మకంతో గెలుపించుకున్నారో ఆ దిశగానే ముందడుగు వేస్తామని, అర్హులందరికీ పథకాలు అమలవుతాయన్నారు.

86వేల మంది రైతులు నియోజకవర్గంలో గతంలో లక్షలోపు రుణమాఫీ ఎంతమందికి ఎన్ని విడతలలో అమలైందని, రుణమాఫీ గురించి మీరా మాట్లాడేది అని ప్రశ్నించారు. పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 1017ఇళ్లు ఇవ్వగా అవన్నీ వర్షాలకు కురుస్తున్నాయని, తాగునీరు సౌకర్యం లేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, పట్టాలు కూడా ఇవ్వకపోతే తామొచ్చిన తర్వాత అవకాశాలు కల్పిస్తున్నామని, స్వలాభం కోసం మీ ప్రయోజనాల కోసం పార్టీలు మారీ కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసిన మీకు ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నం ఫౌండేషన్‌కు రూ.10లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్

» దాతృత్వం చాటుకున్న భాస్కరాచార్యులు, వఖులావాదేవి



భాస్కరాచార్యులు దంపతులను సన్మానిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 23: సత్తుపల్లికి చెందిన వృద్ధ దంపతులు ఖమ్మం అన్నం సేవా ఫౌండేషన్ భవన నిర్మాణం కోసం రూ.10లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో శుక్రవారం అందజేశారు. సత్తుపల్లిలో నివసిస్తున్న మడుంబా విజయ భాస్కరాచార్యులు, వఖులావాదేవి వృద్ధ దంపతులు దాతృత్వం చాటుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నం ఫౌండేషన్ చేస్తున్నటువంటి సేవలను గమనించి గుర్తించి.. వారు కష్టపడి సంపాదించుకున్న 10 లక్షల రూపాయలను అన్నం ఫౌండేషన్ నిర్మాణం కొరకు ఫిక్స్ డిపాజిట్ రూపంలో అందజేశారు. వీరు ప్రస్తుతం వికలాంగుల పెన్షన్ ద్వారా జీవిస్తున్నారు. వీరికి సొంత ఇల్లు కూడా లేదు. కూతురు ఇంట్లోనే నివసిస్తున్నారు. కాగా వీరికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. వీరి జన్మస్థలం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామం.

# రెండు రూపాయల రుణమాఫీ

చింతకాని, ఆగస్టు 23: తీసుకున్న వ్యవసాయ రుణం తిరిగి చెల్లించటమే ఆ రైతుకు శాపంగా మారింది. తనతో పాటు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తించి వారు లబ్ధి పొందగా, తీసుకున్న రుణాన్ని ఆర్థిక క్రమశిక్షణతో చెల్లించనందుకు ఆ రైతుకు మాత్రం రిక్తహస్తాలే మిగిలాయి. చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన రైతు అంబటి రాజేష్ తన గ్రామంలోని సొసైటీ ద్వారా 2022లో లక్షా 10 వేల రూపాయల రుణం తీసుకున్నాడు. ఏడాది తరువాత 2023 అక్టోబర్‌లో తీసుకున్న రుణం మొత్తం చెల్లించాడు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రుణమాఫీ అమలుకు చర్యలు చేపట్టడంతో తనకు రుణమాఫ వర్తిస్తుందని రాజేశ్ ఆశలుపెట్టుకున్నాడు. కానీ ఊహించని విధంగా కేవలం రెండు రూపాయలు మాఫీ చేస్తూ అధికారులు ఫోన్‌కు మెస్సేజ్ పంపడంతో రైతు కంగుతిన్నాడు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించినందున రుణ ఖాతాలో అప్పుగా ఉన్న రూ.2 మాఫీ చేసినట్లు మెస్సేజ్‌లో పేర్కొన్నారు. ఈ మెస్సేజ్ చూసిన రైతు రాజేశ్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో తన పేరు చూసి సంతోష పడ్డానని, కానీ తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌తో ఆ సంతోషం ఆవిరైందని తెలిపాడు. తనకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతున్నాడు.





రైతు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

**నిబంధనల ప్రకారమే రుణమాఫీ**

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రుణమాఫీ పథకం ప్రతి రైతుకు వర్తింపజేస్తున్నామని నాగులవంచ సొసైటీ సీఈవో యాలమూడి శ్రీనివాసరావు తెలిపారు. రుణమాఫీ జీవో ప్రకారం 2023 డిసెంబరు 9 వరకు రుణఖాతాలో అప్పు ఉన్న రైతుకు మాత్రమే రుణమాఫీ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాజేష్ తన రుణాన్ని 2023 అక్టోబరు నెలలో పూర్తిగా చెల్లించడం వలన రుణమాఫీకి అర్హత పొందలేదని చెప్పారు. ఆయన రుణఖాతాలో రూ.2 మాత్రమే అప్పుగా ఉండటంతో ప్రభుత్వం ఆ మేరకు మాత్రమే మాఫీ చేసిందని తెలిపారు.

# భద్రాద్రి చేరుకున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్

భద్రాచలం, ఆగస్టు 23: తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ సంస్థ చైర్మన్ బెల్లయ్యనాయక్ భద్రాచలం చేరుకున్నారు. ఆయన ప్రస్తుతం హౌసింగ్ అతిథిగృహానికి చేరుకోగా ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు స్వాగతం పలికారు. శనివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఐటీడీఏలో ట్రైకార్ పథకం అమలుతీరుపై సమీక్ష నిర్వహించనున్నారు.



బెల్లయ్యనాయక్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

# హజ్‌యాత్రకు యువకుడి పాదయాత్ర



హజ్ యాత్రికుడిని సన్మానిస్తున్న స్థానికులు

సుల్తానాబాద్, ఆగస్టు 23: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మక్కాకు పాదయాత్రతో బయలుదేరిన యువకుడికి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ముస్లిం లు ఘనస్వాగతం పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అబ్దుల్ ఆబిద్ అనే యువకుడు మక్కా దర్శనం కోసం హాజ్‌యాత్రకు పాదయాత్ర చేపట్టాడు. ఈ నెల 12న భద్రాద్రి కొత్తగూడెంలో బయలుదేరిన ఆయన శుక్రవారం ఉదయం సుల్తానాబాద్ చేరుకోగా ఆయనకు స్థానిక ముస్లింలు స్వాగతం పలికారు. తన పాదయాత్ర ప్రతిరోజుకు ఇరవై ఐదు కిలోమీటర్లు మాత్రమే కొనసాగుతుందని ఈ మేరకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిం దని ఆబిద్ తెలిపారు. పాదయాత్ర ద్వారా ఢిల్లీ చేరుకుని జమ్మూ శ్రీనగర్ మీదుగా పాకిస్తాన్ చేరుకుని ఆ తర్వాత అఫ్ఘానిస్తాన్ చేరి అక్కడి నుంచి సౌదీ చేరుకుంటానని తెలిపారు. పాదయాత్ర ద్వారా తాను మక్కా చేరడా నికి ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంటుందని, పది నెలల సమయం పడుతుందని అన్నారు. ఉదయం సుల్తానాబాద్ వచ్చిన ఆబిద్ సుల్తానాబాద్ పాత జెండా వద్ద గల ప్రార్థనా మందిరంలో బస ఏర్పాటు చేశారు. విశ్రాంతి అనంతరం శనివారం బసంత్‌నగర్ వద్ద రాత్రి బస చేస్తా దని ముస్లిం ప్రతినిధులు వివరించారు.

## వైద్యశిబిరం విజయవంతం

తల్లాడ, ఆగస్టు 23: వయోవృద్ధుల కోసం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యశిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ ప్రారంభించారు. ఆయూష్ విభాగం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ బాబూనాయక్ సందర్శించారు. వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వైద్యులైన షుగర్, బీపీ, ఆస్తమా, మొలలు, మోకాలునొప్పులు, గ్యాస్, సైనస్ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. హోమియో వైద్యాధికారి డాక్టర్ నీలిమ, ఫార్మాసిస్టు అఖిల, ఎంఎన్‌వో గడల రాంప్రసాద్, ఎస్ఎన్‌వో లలిత, జాన్‌బీ పాల్గొన్నారు.

# ‘శిథిలం’తో చెలగాటం

(5వ పేజీ తరువాయి)

దించి ఏడు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఖమ్మం ముస్తఫానగర్‌లోని బాలుర బీసీ హాస్టల్, గాంధీచౌక్‌లోని బాలుర బీసీ హాస్టల్, వీవీపాలెం బాలుర హాస్టల్, తిరుమలాయపాలెం బాలికల హాస్టల్, పెనుబల్లి బాలుర, సత్తుపల్లి బాలురు, బనిగండ్లపాడు బాలుర హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఆయా భవనాల పైకప్పు పెచ్చులు ఊడుతుండడంతో భవనాలు పడిపోతాయోనన్న భయం నెలకొంది. ఈ భవనాల విషయం మంత్రి తుమ్మల దృష్టికి వెళ్లడంతో ఖమ్మం నియోజకవర్గంలోని మూడు హాస్టల్స్‌కు సంబంధించి ఒక్కో భవనానికి రూ.3కోట్ల చొప్పున ప్రతిపాదనలు పంపారు. వీటికి త్వరలో నిధులు మంజూరు కాబోతున్నాయి. మిగిలిన భవనాలకు ఇంకా ప్రతిపాదనలు వెళ్లాల్సి ఉంది. అయితే కొత్త భవనాలు నిర్మించే వరకు శిథిల భవనాల్లోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటు చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలో మీనవోలు, సిరిపురం, సత్తుపల్లి బాలికల వసతిగృహాలు, ముచ్చర్ల గంగారం, కల్లూరులో బాలుర వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయి. ఖమ్మంలోని ఎస్సీ సంక్షేమ భవనాలు కూడా పెచ్చులూడుతున్నాయి. వీటిని కూల్చివేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించినా ఇప్పటి వరకు వాటిని కూల్చలేదు. కొన్ని చోట్ల కొత్త భవనాలు నిర్మించారు. విద్యార్థులను కొత్తభవనాల్లోకి మార్చినా పాత భవనాలను మాత్రం తొలిగించలేదు.



ఆయా భవనాల్లోకి విద్యార్థులు చదువుకోవడానికి, సరదాగా ఆడుకోవడానికి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదైనా జరిగితే విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

ఇక గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న వల్లభి, తిమ్మరావుపేట, మధిర, ముస్తఫానగర్ హాస్టల్ భవనాలు కూడా శిథిలావస్థలో ఉన్నాయి. రాత్రివేళ పెచ్చులూడుతున్నాయి. వీటిని తొలిగించి కొత్త భవనాలు నిర్మించాలని సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ పాతవి కూల్చడానికి కొత్తవి నిర్మించడానికి నిధులు మంజూరుకావడం లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలను కూల్చివేసేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కొత్తభవనాలు మంజూరు లేక ఒకేచోట ఆయాశాఖల ఇంటిగ్రేటెడ్‌భవనాలు నిర్మించడం, ప్రైవేటు హాస్టల్ భవనాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం ఇల్లెందు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో బాగంగా, సింగరేణిలో కూడా మనం పర్యావరణాన్నికాపాడాలనే ఉద్దేశంతో ప్రతి అడుగు పచ్చదనం అనే నినాదంతో సమీప గ్రామాల్లో, మైన్లు, డిపార్టుమెంట్లలో, ఓబీ డంప్‌లలో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యం పాటిస్తున్నామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికిఈ మొక్కలను నాటే కార్యక్రమంలో భాగస్వాములను చేయడం వల్ల పర్యావరణంపై అవగాహన పెరిగి భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణానిన అందివచ్చని అన్నారు. మొదటి నపుంచి కూడా మన సంస్థ పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ చూపి మొక్కలు నాటడం వల్ల అడవులను పెంచే కార్యక్రమం సంగరేణి సంస్థ కృషి మరువలేనిదన్నారు. సింగరేణి సంస్థ 2023 సంవత్సరం వరకు 14,680.5 హెక్టార్లలో 7.32 కోట్లపైబడి మొక్కలు నాటిందన్నారు. ఈ సంవత్సరం సింగరేణి సంస్థ 664 హెక్టార్లలో 13.30లక్షల మొక్కలు పెంచాలనే లక్ష్యంతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా గనుల్లో, ఓబీ డంప్‌ల్లో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. సింగరేణి సంస్థచైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఒక్కరే కొత్తగూడెం ఇల్లెందు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో 235 వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. నాటిన మొక్కలతో కలిపి మొత్తం సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సింగరేణి వ్యాప్తంగా మొత్తం 40 ఎకరాల విస్తీర్ణంలో 18,291 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఐఎ) జి. వెంకటరమణ, ఏజీఎం (ఫారెస్ట్) డబ్ల్యు వివేక్‌బాబు, డీజీఎం (పారెస్ట్) ఎటీ. హరినారాయణ, డీజీఎం (ఈఅండ్ఎం)వర్క్‌షాపు రాజీవ్‌కుమార్, మేనేజింగ్ (ఫారెస్ట్) ఆర్‌బి. డేవిడ్ అభిలాష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సింగరేణి చైర్మన్ బలరాం



టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

## పాఠశాలలు, వసతి గృహాలకు
# నాణ్యమైన సరుకులు అందించాలి

» ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ఆగస్టు 23: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌కు నాణ్యతతో కూడిన సరుకులు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ ఏజెన్సీల ద్వారా సరఫరా అయ్యే వంట సరుకుల కోసం నిర్వహించిన టెండరు ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడానికి, విద్యార్థులకు కాస్మోటిక్ సరఫరా చేయడానికి జిల్లాలోని వివిధ ఏజెన్సీల ద్వారా టెండరు ప్రక్రియను కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపిక చేశారు. టెండరు పొందిన వారు సరఫరా చేసే సరుకులను వార్డెన్లు సక్రమంగా తనిఖీ చేసిన తరువాతే తీసుకోవాలని, నాసిరకమైన సరుకులు సరఫరా చేస్తే వెంటనే మా దృష్టికి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, జీసీసీ డీఎం దావీద్ పాల్గొన్నారు.



డంపింగ్ యార్డులో యంత్రాలతో రహదారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# డంపింగ్‌లో భారీ వాహనాల డ్రైవ్

» 200 మిషన్లతో రెండు రోజులుగా క్లియరెన్స్ పనులు

» పారిశుధ్య వాహనాల రవాణాకు రహదారి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 23: ఖమ్మం నగరంలోని చెత్తను నిల్వ ఉంచే డంపింగ్ యార్డు ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గానికి పెద్ద సమస్యగా ఏర్పడింది. సాయంత్రం సమయంలో ఖమ్మం నగరం నుంచి డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే ఇకోటెక్, ప్రైవేట్, స్వచ్ఛ భారత్ పారిశుధ్య వాహనాలు రహదారిపై చెత్తను డంపింగ్ చేయటంతో డంపింగ్ యార్డు సమస్య ఏర్పాడింది. గత వారం రోజులుగా సమస్య పెరిగి పారిశుధ్య వాహనాల డ్రైవర్లు మేయర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. దీంతో మేయర్ పునకొల్లు నీరజ సూచనలు, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ గత రెండు రోజులుగా డంపిగ్ యార్డులో స్పెషల్ హేవీ క్లియరెన్స్ డ్రైవ్ చేపట్టారు. రెండు 200 స్థాయి మిషన్లు, డోజర్లను ఏర్పాటు చేసి డంపింగ్ యార్డులో పారిశుధ్య వాహనాల రహదారి క్లియరెన్స్ పనులు చేపట్టారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు
# మీ సేవా కేంద్రాల మొబైల్ నెంబర్లు

» హెల్ప్ డెస్క్‌కు అత్యధిక ఫిర్యాదులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 23: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన మొదటి అంకంలోనే మొబైల్ నెంబర్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ సెంటర్‌లో అత్యధిక ఫిర్యాదులు మొబైల్ నెంబర్ల మార్పు కోసం రావటమే విశేషం. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసిన సమయంలో దరఖాస్తుదారులు మీ సేవా కేంద్రాల వద్దకు వెళ్లి దస్త్రాలు అప్‌లోడ్ చేసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలో మీ సేవా కేంద్రాల వద్ద కొన్ని దరఖాస్తుదారుల ఫోన్ నెంబర్లకు బదులుగా మీ సేవా కేంద్రాల ఫోన్ నెంబర్లను ఉపయోగించి ఓటీపీ నెంబర్ల ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో అదే సమస్య ఏర్పడింది. దరఖాస్తుదారులు తమ మొబైల్ నెంబర్, కుటుంబ సభ్యుల మొబైల్ నెంబర్లు నమోదు చేస్తే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఓపెన్ కావటం లేదు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి హెల్ప్ డెస్క్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఫారమ్ చూపించి మొబైల్ నెంబర్ వెరిఫికేషన్ చేయించుకోవటంతో వరసగా మీ సేవా కేంద్రాల సెల్‌ఫోన్ నెంబర్లు బయట పడుతున్నాయి.



మొబైల్ నెంబర్లు మార్చమని వచ్చే ఫిర్యాదులు తీసుకుంటున్న హెల్ప్ డెస్క్ సిబ్బంది

# ఘనంగా మాజీమంత్రి శీలం సిద్దారెడ్డి జయంతి

ఎర్రుపాలెం, ఆగస్టు 23: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత సీనియర్ కాంగ్రెస్ నేత, ఖమ్మం జిల్లా తొలిమంత్రి శీలం సిద్దారెడ్డి 97వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సిద్దారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దారెడ్డి గ్రామాల్లో నీలం సంజీవరెడ్డి పేరుతో రాష్ట్రంలోనే తొలి ఆడిటోరియం నిర్మాణం, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్యకేంద్రం, గ్రంథాలయం, పశు వైద్యశాల, ప్రజల భాగస్వామ్యంతో భవనాలు నిర్మించి రాష్ట్రంలో ఒక గుర్తింపు పొందారని తెలిపారు. మధిర నియోజకవర్గంలో మెట్టభూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నాగార్జునసాగర్ ఎడమకాలువను విస్తరించి మధిర ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని గుర్తుచేశారు. కట్టలేరు ద్వారా వృథాగా పోతున్న నీటిని బీడుభూములకు మళ్లించాలన్న లక్ష్యంతో కట్టలేరు నదిపై ఆనకట్టను నిర్మించి దాదాపు 4,700 ఎకరాలకు సాగునీరు, పలు చెరువులకు నీటిని నింపి బీడు భూములను సాగుభూములుగా మార్చిన గొప్పనాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యన్నం పిచ్చిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, పెద్దగోపవరం సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరకొండ రాజీవ్‌గాంధీ, ఎర్రుపాలెం టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే ఇస్మాయిల్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే జాన్‌బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ తల్లపురెడ్డి ప్రవళిక, శీలం ఉమామహేశ్వరి, నాయకులు వేమిరెడ్డి వెంకటరెడ్డి, పెద్దమళ్ల మోహన్‌రావు, కోనా సత్యనారాయణగుప్తా, బుంగా పుల్లారావు, దాసరి మోక్షం, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# సంక్షేమ శాఖల్లో టీఎన్‌జీవోస్ సభ్యత్వ నమోదు



కస్తాల సమక్షంలో సభ్యత్వాలు అందిస్తున్న టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 23: ఉద్యోగుల పక్షాన ఎప్పుడు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తోందని టీఎన్‌జీవోస్ అడ్‌హక్ కమిటీ జిల్లా బాధ్యులు కొణిదెన(బుల్లెట్) శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని సాంఘీక సంక్షేమ శాఖ విభాగాల్లో టీఎన్‌జీవోస్ సభ్యత్వ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ సమక్షంలో ఉద్యోగులకు సభ్యత్వాలను అందించారు. టీజీవోస్, టీఎన్‌జీవోస్ సంఘాలు సమన్వయంతో పనిచేయటం ద్వారానే అధికారుల, ఉద్యోగుల మధ్య సమన్వయం ఏర్పాడుతోందని, ప్రభుత్వ యంత్రాంగం పరిపాలన సజావుగా సాగుతుందన్నారు. టీఎన్‌జీవోస్ నాయకులు జైపాల్, దుర్గాప్రసాద్, శ్రీధర్ సింగ్, లలితకుమారి, గుంటుపల్లి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, పెద్దినేని రాధాకృష్ణ, బూసా చంద్రశేఖర్, పవన్, రవి, సగ్గుర్తి ప్రకాశ్‌రావ్, జొన్నలగడ్డ మన్మధరావు, ముఖీద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు సీనియర్
# జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

భద్రాచలం, ఆగస్టు 23: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక ఈ నెల 25న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ బాధ్యులు శరాన్ తేజ, ఆనంద్ పౌల్ తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 25న స్థానిక జూనియర్ కాలేజీ మైదానంలో తమ వెంట జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని తెలిపారు. ఎంపికలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి 27నుంచి వరంగల్ ఈస్టుజోనల్ టోర్నీ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. పూర్తి వివరాలకు 9652627452, 9866451123లో సంప్రదించాలని కోరారు.

## సింగరేణి మహిళా కళాశాలలో
# పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 23: కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలలో పీజీ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతా శారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంకాం, ఎంఎస్సీ బాటనీ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రవేశం పొందడానికి సీపీజీఈటీ - 2024 ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్‌ను ఎంపిక చేసుకోవడానికి ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. మేనేజ్‌మెంట్ సీట్లు పొందుటకు ఆసక్తిగల విద్యార్థులు పూర్తి వివరాలకు 08744-242492 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



విచారణ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

## యూరియా
# అక్రమ రవాణాపై విచారణ

ఇల్లెందు టౌన్, ఆగస్టు 23: ఇల్లెందు సహకారపరపతి సంఘం పరిధిలో ఉన్న యూరియా మాణిక్యారంలోని ఓ వ్యాపారి గోడౌన్‌కు అక్రమంగా తరలించడంపై శుక్రవారం వ్యవసాయ శాఖాధికారులు విచారణ చేపట్టారు. ఇల్లెందు వ్యవసాయశాఖ ఏడీఏ లాల్‌చంద్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖాధికారుల బృందం మాణిక్యారం, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, సహకార పరపతి సంఘం కార్యాలయాల్లో విచారణచేపట్టారు. 70 యూరియా కట్టలను ఎవరి పేరుతో తరలించారు.. అనే అంశంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. కాగా యూరియా అక్రమంగా రవాణా చేసిన సొసైటీ అధికారులతోపాటు వ్యాపారి లైసెన్స్‌లను రద్దు చేసి చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు.

## విలేకరిపై దాడి.. కేసు నమోదు

బూర్గంపాడు, ఆగస్టు 23: వార్త సేకరణకు వెళ్లిన విలేకరిపై దాడికి పాల్పడిన ఘటనపై బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. జింకలగూడెం గ్రామంలో గోవులు అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఓ చానల్ విలేకరి మహేష్ రెడ్డి, అతడి స్నేహితుడు కలిసి కవరేజ్‌కు వెళ్లారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు వారిపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## లారీ పీడీఎస్ బియ్యం పట్టివేత?

నేలకొండపల్లి, ఆగస్టు 23: మండల పరిధిలోని అప్పల నర్సింహాపురంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఓఇంటి వద్ద బియ్యం-నూకల లారీని నేలకొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. అప్పలనర్సింహాపురం నుంచి ఏపీ16 టీజీ2695 నెంబరు గల లారీ పీడీఎస్ బియ్యం లోడుతో వెళ్లటానికి సిద్ధంగా ఉందని వచ్చిన సమాచారంతో నేలకొండపల్లి హెడ్ కానిస్టేబుల్ సీతారాములు ఆధ్వర్యంలో వెళ్లి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్ బియ్యం కాదని నూకలని, కోళ్ల ఫారాలకు పంపుతున్నామని లారీ పంపుతున్న వ్యక్తి పోలీసులకు తెలిపారు. పోలీసులు కాగితాలను పరిశీలించి సివిల్ సప్లై అధికారులకు సమాచారమిచ్చారు. సివిల్ సప్లై అధికారులు శ్యాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపినట్లుగా సమాచారం. ఇదిలా ఉండగా లారీ గ్రామానికే చెందిన ఓవ్యక్తిదని, అతను ఆంధ్రా సరిహద్దుల్లో ఓరైస్‌మిల్లును లీజుకు తీసుకుని వ్యాపారం నడుపుతున్నాడని తెలుస్తున్నది. కాగా లారీలోనివి ఖచ్చితంగా పీడీఎస్ బియ్యమేనని గ్రామస్థులు చెపుతున్నారు.



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన లారీ

# క్రైం సమాచారం

## సుజ్ఞానపురంలో ఎక్సైజ్ దాడులు

దుమ్ముగూడెం, ఆగస్టు 23: జిల్లాలోనే పేరొందిన నాటుసారా తయారీ కేంద్రం సుజ్ఞానపురంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. మూడువందల లీటర్ల బెల్లం పానకం, ఐదు లీటర్ల నాటుసారాను పట్టుకొని సుజ్ఞానపురంకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. గ్రామ సమీపాన వాగు ఒడ్డున తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి పానకం ఊరబెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. కాగా ఎక్సైజు దాడుల విషయం ముందుగానే తెలుసుకున్న నాటుసారా తయారీ దారులు తయారైన వందలాది లీటర్ల సారాను సమీప అటవీప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ఏఈఎస్ కరణ్‌చంద్, సీఐ రహీమున్నీసా, ఎస్‌ఐలు అల్లూరి సీతారామరాజు, కిషోర్‌బాబు, గౌతమ్, కానిస్టేబుళ్లు వీరబాబు, లలిత, వెంకట్ తదితరులున్నారు.

## సారా కేసులపై నలుగురి బైండోవర్

తిరుమలాయపాలెం, ఆగస్టు23: నాటుసార తయారుచేస్తూ విక్రయిస్తున్న నలుగురిపై బైండోవర్ కేసు నమోదయింది. ఎక్సైజ్ సిబ్బంది తహసీల్దార్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. మహబూబాబాద్ జిల్లా తానంచర్ల ధరావత్‌తండాకు చెందిన ధరావత్ సోమ్లా తిరుమలాయపాలెం మండలం లక్ష్మీదేవిపల్లి తండాకు మూడ్ పద్మ, మూడ్ కేవుల్యా, మూడ్ అశోక్‌లపై బైండోవర్ కేసులు నమోదు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. రూ.2లక్షల పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

## రెండు ఆర్ఎంపీ క్లీనిక్‌లు సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

చుంచుపల్లి, ఆగస్టు23: చుంచుపల్లి మండలంలో పరిమితికి మించి వైద్యం చేస్తున్న రెండు ఆర్ఎంపీ క్లీనిక్‌లను శుక్రవారం సీజ్ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశాలనుసారం డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్ చుంచుపల్లి మండలంలోని పలు క్లీనిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. మితిమీరి వైద్యం చేస్తున్న పెనగడపలోని శ్రీసాయి మహాలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఫోరుఇంక్లైన్‌లోని మథర్‌థెరిస్సా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను రెంటింటిని సీజ్ చేశారు. ఇటీవల ఆర్ఎంపీ వైద్యులు చేస్తున్న వైద్యం వికటించి అనారోగ్యం భారీన పడ్డ వీరభద్రం అనే వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఈ సంఘటనతో డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వారు ఈ తనిఖీలను చేపట్టినట్లు డిప్యూటీ డెమో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట పెనగడప పీహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ ఆమ్రిన్, ఆశా వర్కర్లు, హెల్త్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

వైరా, ఆగస్టు 23: వైరా రిజర్వాయర్‌లో వేటకు వెళ్లి గల్లంతైన ఈర్ల రాములు(48) అనే మత్స్యకారుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. గురువారం చేపల వేటకు వెళ్లిన రాములు భారీ ఈదురుగాలులు వర్షంతో తెప్ప తిరగబడి నీటిలో మునిగిపోయి గల్లంతయ్యాడు. ఆయన మృతదేహం కోసం గాలించగా గల్లంతైన ప్రాంతంలోనే లభ్యమైంది.

# నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న మావోయిస్టులు

» తప్పును కప్పిపుచ్చుకోవడానికే మాయమాటలు

» భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్



కొత్తగూడెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమాయకురాలైన బండి రాధ అలియాస్ నీల్సోను అతి కిరాతకంగా చంపి చర్ల మండలం చెన్నాపురం గ్రామశివారులో మృతదేహాన్ని రోడ్డుపై పడేసిన మావోయిస్టు పార్టీ నాయకులు వారి తప్పును కప్పిపుచ్చుకోవడానికి మాయమాటలు చెప్పడం వారి క్రూరత్వానికి నిదర్శనమని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉన్నత చదువులు చదువుకుని విలువైన జీవితాన్ని గడపాలనుకున్న రాధను బలవంతంగా మావోయిస్టు పార్టీలోకి చేర్చుకుని ఆమె భవిష్యత్‌ను అంధ కారంలోకి నెట్టేశారని ఎస్పీ పేర్కొన్నారు.

దళితురాలైన రాధా అనతికాలంలోనే పట్టుదలతో తమ పార్టీలో నాయకత్వం వహించేస్థాయికి చేరితే.. అలాంటప్పుడు చంపవల్సిన అవసరం ఏవిమి వచ్చింనది ప్రశ్నించారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు బాధ్యత వహించాలని ప్రకటన విడుదలచేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. తమ సొంత పార్టీ చేతిలోనే హత్యకు గురైన రాధను శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసి ఆమెను లైంగికంగా వేధిస్తూ, కులం పేరుతో దూషించి చిత్రహింసలకు గురిచేశారని ఆమె సోదరుడు కూడా ఆరోపించారని పేర్కొన్నారు. ఆమెను చంపకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ కర్కశంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన రాధా లాంటి దళిత మహిళను పోలీసు ఇన్ఫార్మర్ అని ముద్ర వేయడం, అగ్రనాయకుల నీచమైన ఆలోచనలకు నిదర్శనమని మండి పడ్డారు.

తమ కూతురికి బలవంతంగా తీసుకెళ్లి మావోయిస్టు పార్టీలోకి చేర్చుకున్నారని రాధ తల్లి పల్లెపాటి పోచమ్మ 2022 జనవరిలో విశాఖపట్నం జిల్లా, పెద్దబయలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఈ విషయంలో 2022 జనవరి 3న సీఆర్ నెం. 01/2022 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. కేవలం నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు విలాసవంతమైన జీవితాలను గడపటానికే అమాయకులైన ఆదివాసీ ప్రజలను బానిసలుగా మార్చుకుని పేర్కొన్నారు. వారిని అభివృద్ధికి దూరం చేస్తూ భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. ప్రజలు, యువత, మహిళలు, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల ప్రజాసంఘాల ఈ అనాగరికమైన హత్యను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

# గుప్త నిధులకోసం అన్వేషణ

» క్షుద్రపూజలంటూ తొలుత ప్రచారం..

» పోలీసుల అదుపులో తొమ్మిది మంది

చంద్రుగొండ, అగస్టు 23: చంద్రుగొండ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపలో గురువారం రాత్రి గుప్తనిధుల అన్వేషణ జరిగింది. అక్కడ పెద్ద గొయ్యి తవ్వటంతో పాటు పూజలు జరిగాయి. శుక్రవారం ఈ దృశ్యాన్ని చూసిన కొందరు క్షుద్రపూజలు జరిగాయని ప్రచారం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మందిని చంద్రుగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ చంద్రుగొండలో వివరాలు వెల్లడించారు. దామరచర్ల చెందిన కర్రి రామకృష్ణ అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన బేతి నీలయ్యను కలిసి తన జామాయిల్ తోటలో యాదవరాజుల కాలం నాటి గుప్త నిధులు ఉన్నాయని కొంత నగదు ఇస్తే పూజారులను తీసుకువచ్చి బయటకు తీస్తానని తెలిపాడు. దీంతో నీలయ్య కొంత నగదును రామకృష్ణకు ఇచ్చాడు. అనంతరం రామకృష్ణ ఇల్లందుకు చెందిన భుక్యా రమేష్ అనే పూజారి, అతని అనుచరులు బాణోత్, రామకృష్ణ, నాగేశ్వరావుతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన భూమిలో లోహాలను గుర్తించే పరికరం కలిగిన యుగంధర్ అతని అనుచరులు చక్రవర్తి, రాంబాబుతో సంప్రదింపు జరిపి నిధులు తీసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. గురువారం రాత్రి తవ్వకాలు ప్రారంభించిగా శుక్రవారం తెల్లవారు జామున నీలయ్య రూ.50 వేలు తీసుకొని వెళ్లాడు. నిధులు దొరకలేదు, మరో సారి తవ్వకాలు జరపాలని మరి కొంత నగదు సిద్ధం చేయమని నీలయ్యను రామకృష్ణ కోరాడు. వీళ్ల వ్యవహారంపై అనుమానంతో పాటు నీలయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు నిందితులను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో పాల్గొన్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, స్థానిక ఎస్ఐ స్వన్న



గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

# మెరుగు పేరుతో మోసం

» ఆరుతులాల బంగారం అఫహరణ

» నకిలీ బంగారం అంటగట్టిన కేటుగాళ్లు

తిరుమలాయపాలెం, ఆగస్టు23: సమాజం శాస్త్రసాంకేతిక రంగాలలో ముందుకుపోతున్నా ఇంకా ప్రజలు మూఢనమ్మకాలకు బలవుతున్నారు. బంగారాన్ని మెరుగుపెడతామంటూ ఇద్దరు వ్యక్తులు మహిళలను బురిడీ కొట్టించి ఆరుతులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది.

మండలంలోని తాళ్లచెరువు గారమానికి చెందిన చిగురుపాటి లక్ష్మి, చిగురుపాటి సుమని అనే అత్తాకోడళ్లకు చెందిన ఆరుతులాల బంగారు పుస్తెల తాడును మెరుగు పెడతామని చెప్పి ఇద్దరు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇద్దరు బైక్‌పై వచ్చి వెండి, బంగారు వస్తువులను మెరుగుపెడతామని చెప్పి మహిళల వద్దకు వెళ్లారు. మొదటగా సదరు మహిళలకు చెందిన పట్టీలను మెరుగు పెట్టి వారిని నమ్మించారు.

అలాగే బంగారాన్ని కూడా మెరుగుపెడతామని మాయమాటలు చెప్పి వారిని నమ్మించారు. వారి మెడలోని ఆరుతులాల బంగారాన్ని మోసగాళ్లకు ఇచ్చారు. దీంతో వారి ఎదుటే ఓ పాత్రలో వేశారు. అనంతరం ఇంటతిలోకి వెళ్లి మరో పాత్ర తేవాలని చెప్పగా వారు ఇంటిలోకి వెళ్లారు. వారు బంగారాన్ని తీసుకుని నకిలీ బంగారాన్ని పాత్రలో వేశారు. పాత్రలో వేసిన బంగారాన్ని ఇప్పుడే తీయవద్దని గంట తర్వాత తీయమని చెప్పి వారు వెళ్లి పోయారు. దీంతో వారు పాత్రలోని బంగారాన్ని చూడగా అది నకిలీదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు.

కూసుమంచి సీఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్ సంఘటనాస్థలాన్ని చేరుకుని సదరు బాధితులనుంచి వివరాలు సేకరించారు. దొంగతనంకు పాల్పడింది స్థానికుల పనా లేక అంతర్‌జిల్లాముఠా పని అనా ఆరాతీస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు, ఆగస్టు 23: లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఉడ్‌యార్డు ప్రాంతానికి చెందిన నాగేంద్రబాబు (19 సం)కడుపునొప్పి తాళలేక, పది రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా, పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

## యువతి అదృశ్యం.. కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: యువతి అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఓ గిరిజన గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి హైదరాబాదులో డిగ్రీ చదువుతోంది. గతనెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సదరు యువతి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

WALK - IN - INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలకు హాజరుకాగలరు.

ఆంధ్రజ్యోతి

డివిజన్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ (SR)

సత్తుపల్లి, పాల్వంచ, అశ్వారావుపేట, మధిర

అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్‌మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును. పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు

ఇంటర్వ్యూ తేది: 27-08-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు

ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి కార్యాలయం.
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్స్ నెం: 112,
ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హావేలి,
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

శనివారం 24 ఆగస్టు 2024

## ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్

దమ్మపేట, ఆగస్టు 23: దమ్మపేట మండలంలోని ముకుందాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొచ్చెర్ల శ్రీనివాసరావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జీవితంపై విశ్రాంత ఆచార్యులు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పరిశోధనలు చేశారు. 'ఏ బయోగ్రాఫికల్ స్టడీస్ ఆఫ్ జలగం వెంగళరావు' అనే పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ ఆచార్యులు లావణ్య, ఇందిరా, రమేశ్, అరుణ చేతుల మీదుగా శ్రీనివాసరావు డాక్టరేట్ అందుకున్నారు. పరిశోధనకు సహకరించిన ఆచార్యులు అర్జునరావు, అంజయ్య, ఇంటర్వ్యూకు సహకరించిన మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.


డాక్టరేట్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు

### సర్వజన ఆసుపత్రిలో
# మౌలిక వసతులు కల్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య
- ఆసుపత్రి ఎదుట ధర్నా

కొత్తగూడెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సర్వజన ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ పాతవ్యాధి నయం చేసుకోవడానికి రోగులు ఆసుపత్రికి వస్తే ఆసుపత్రిలో ఉన్న డ్రైనేజీ సమస్య వల్ల కొత్త రోగాలతో ఇంటికి వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో ఆసుపత్రిలో ఉన్న సమస్యలను అధ్యయనం చేయడానికి సీపీఎం పట్టణ కమిటీ సర్వే నిర్వహించిందని ఈ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు. సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నేటికి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. డాక్టర్ పోస్టులు, నర్సింగ్‌పోస్టులు ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రోజుకి ఐదు వందల మంది రోగులు వస్తున్న హస్పటల్‌లో కేవలం మూడు డ్రక్టర్లు మాత్రమే ఉన్నాయన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పరిస్థితులే ఈ రకంగా ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, పట్టణ కమిటీ సభ్యులు డి. వీరన్న, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

## గురుకుల పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు

అశ్వారావుపేట టౌన్ ఆగస్టు 23: అశ్వారావుపేటలో మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్యా పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ రాందాస్‌నాయక్ తెలిపారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చారు. దగ్గు జలుబు జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి రక్తపరీక్షలు చేసి మందులు అందించామన్నారు. అంటువ్యాదులు పరిశుభ్రతపై విద్యార్థులు వైద్యులు పలు సూచనలు చేశారు కార్యక్రమంలో బాలుర గురుకుల ప్రిన్సిపాల్ రేణుక రాణీ. స్టాఫ్‌నర్స్ పావని. వైద్య సిబ్బంది సిహెచ్ ప్రసాద్. ఏఎన్ఎం సూజత. ఆశ కార్యకర్త పావని. పాల్గొన్నారు.


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యుడు

# నిలిచిన పనులు.. ఇబ్బందులు పడుతున్న జనం

- అస్తవ్యస్తంగా గణేష్‌టెంపుల్ రోడ్డు

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 23: కొత్తగూడెం కేంద్రంలోని ప్రధాన ఆలయమైన గణేష్‌టెంపుల్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారి అస్తవ్యస్థంగా మారింది. ఎన్నికల ముందు గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించింది. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మున్సిపల్ అధికారులు ఇరుపక్క ప్రహరీ కూల్చడం, డ్రైనేజీలను నిర్మించడం వంటి పనులు చేశారు. స్థానికులు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఊపిరిపీల్చుకున్నారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడ పనులు అక్కడే అధికారులు నిలిపివేశారు. దీంతో సగం పనులతో మరింత అధ్వానంగా మారింది. గంతలు ఏర్పడటం, కంకర తేలడంతో చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. బ్యాంకుల సముదాయాలు, ఆసుపత్రులు ఈ రోడ్డు మార్గంలోనే ఉండటంతో నిత్యం వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో మరింత ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి. లక్షల రూపాయల నిధులు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంపై పలు అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మంజూరైన నిధులు ఏం చేశారు... నిర్మాణాల్లో జాప్యం ఎందుకు చేస్తున్నారు.. నిధులు ఏమైన కాజేశారా...? అంటూ ఆరోపిస్తోన్నారు. ఇప్పటికైన అధికారులు,ఎమ్మెల్యే దృష్టి సారించి సగంలో నిలిచిపోయిన ఈ రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.




రాళ్లు తేలి అస్తవ్యస్థంగా మారిన గణేష్‌టెంపుల్ రోడ్డు

## 'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

భద్రాచలం, ఆగస్టు 23: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన ఉద్యోగులు శుక్రవారం నిరసన నిర్వహించారు. తానీషా కల్యాణ మండప ప్రాంగణం ముందు ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకొని పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలి, సీపీఎస్‌ను రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, సీపీఎస్ వద్దు, ఓపీఎస్ ముద్దు, ఉద్యోగి మేలుకో, పాత పెన్షన్ సాధించుకో అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాద్, ఏఈవో భవానీరామ కృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, కృష్ణస్వామి, శ్రీకాంత్, రాకేష్, ఎం.రవి కుమార్ శర్మ, నరసింహాచార్యులు, వి.ఆంజనేయవరప్రసాద్ శర్మ, ఎస్టీజీ అంతర్వేదికృష్ణమాచార్యులు, పవన్‌కుమారాచార్యులు, కేశవ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఆలయ సిబ్బంది

## సొసైటీ అక్రమాలపై విచారణ జరపాలి: మాస్‌లైన్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 23: ఇల్లెందు వ్యవసాయసహకార పరపతి సంఘంలో అవినీతి అక్రమాలకు అడ్డుఅదుపు లేకుండ పోయిందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు, కో ఆపరేటీవ్ సొసైటీ మాజీ చైర్మన్ ఆవుల కిరణ్ ఆరోపించారు. శుక్రవారం ప్రజాపంథా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమాశంలో వారు మాట్లాడుతూ గత రాత్రి మాణిక్యారంలో ఓ వ్యాపారి ఇంట్లో 70 యూరియా కట్టలు పట్టుబడ్డాయని ఈ కొద్ది మాత్ర మేనని వేలాది యూరియా కట్టలు వ్యాపారు ఇళ్లల్లో, గోదాంలలో మూలుగుతున్నాయని ఆరోపించారు. కో ఆపరేటీవ్ సొసైటీల్లో పేద రైతులకు యూరియా కట్టలు లభించడం లేదని వాపోయారు. కో ఆపరేటీవ్ సొసైటీ అధికారులు వ్యాపారస్తులతో కుమ్మక్కై లంచాలకు అలవాటుపడి యథేచ్ఛగా వ్యాపారుల గోడౌన్లకు యూరియాను తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ వ్యాపారులు యూరియాను సొసైటీలో కొనుగోలు చేసి రూ.350ల నుంచి రూ.400ల వరకు అమ్మకాలు కాగిస్తున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ డివిజన్ నాయకులు అజ్మీర బిచ్చా, వాంకుడోత్ శంకర్, ఆర్. బోస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి: తహసీల్దార్

జూలూరుపాడు/అశ్వారావుపేటటౌన్, ఆగస్టు 23: చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్లో ప్రవేశాలు పొంది ఓపెన్ టెన్త్, ఇంటర్‌లను అభ్యసించవచ్చు అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్వాతిబింధు తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకై అడ్మీషన్లు జరుగుతున్నాయని వచ్చే నెల ఆఖరు వరకు అవకాశం ఉందని తెలిపారు. ఓపెన్ స్కూల్ గురించి ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుగులోత్ వెంకట్, ఓపెన్ స్కూల్ కో-ఆర్డీనేటర్ టి.లక్ష్మీనర్సయ్య, అసిస్టెంట్ కో-ఆర్డీనేటర్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో సార్వత్రిక విద్యా విధానం పద్దతి ద్వారా ఈ విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్ అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని స్థానిక హైస్కూల్ హెచ్ఎం పి హరిత పేర్కొన్నారు, మండల విద్యాశాఖ అధికారిని కీసరి లక్ష్మీ ఓపెన్ స్కూల్ పోస్టర్, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు

## పరిశోధనలపై దృష్టి సారించండి: డీఈవో

చంద్రుగొండ, అగస్టు 23: పరిశోధనా రంగంలో రాణించాలంటే హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని డీఈవో వెంకటాచారి సూచించారు. విజయవంతంగా చంద్రయాన్ ప్రయోగం జరిగి సంవత్సరం అయిన సందర్భంగా శుక్రవారం డీఈవో చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలోని ప్రయోగశాలను పరిశీలించి, విద్యార్థులతో సమావేశం మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారత్ దేశానికి యువ శాస్త్రవేత్తలు ఎంతో అవసరమని తెలిపారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింట్ ప్రయోగశాలను వినియోగించుకొని అంతరక్ష శాస్త్రవేతలుగా, వివిధ రంగాలలో పరిశోధకులుగా ఎదగాలని కోరారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు పరిశోధనలపై ఆశక్తి పెంచే విధంగా కృషిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఈవో వెంకటాచారి

### ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

దుమ్ముగూడెం: నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో చంద్రయాన్-3 ప్రయోగం దేశానికే గర్వకారణమని హెచ్ఎం బోళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిజిక్స్ టీచర్ల ఆధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులనందజేశారు. టీచర్లు చుక్క శ్రీనివాసరావు, రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ..

పాల్వంచ రూరల్, ఆగస్టు 23: మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల నీరంతా వృధాగా ప్రవహించిపోతున్నాయి. మండలంలోని జగన్నాథపురం పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ ఎయిర్‌వాల్ పగిలిపోయింది. అక్కడక్కడ లీకేజీలు ఎయిర్‌వాల్ పగిలి నీరంతా వృధాగా పోతుంది. శుక్రారం భగీరథ అధికారులకు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు.

## అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఆందోళన

ఇల్లెందు టౌన్, ఆగస్టు 23: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకులను తక్షణమే నియమించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటి కోశాధికారి జే. గణేష్ మాట్లాడుతూ ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు జిల్లాలోని పలు జూనియర్ కళాశాలలో హిస్టరీ, సివిక్స్ సబ్జెక్టులకు కలిపి ఒక్కరే అధ్యాపకులు బోధిస్తున్నారన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, సాయికుమార్, సంతోష్, కీర్తి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణంలో లారీ టైర్ల దగ్ధం

భద్రాచలం ఆగస్టు 23: భద్రాచలం గోదావరి వారధిపై శుక్రవారం రాత్రి లారీ టైర్ బరెస్ట్ అయి బ్రేక్ డ్రమ్ములు పట్టేయడంతో టైరు డిస్కులు రాపిడికి గురై మంటలు చెలరేగాయి. ఈ సమయంలో లారీ టైర్లు ఆ మంటల్లో కాలిపోయాయి. ఈ క్రమంలో లారీ మంటల్లో చిక్కుకున్న విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వారు సకాలంలో స్పందించడంతో భారీ నష్టం తప్పింది .చత్తీస్గడ్ లోని రాయపూర్ నుంచి ఐరన్ లోడ్‌తో ఏపీలోని విజయవాడకు (లారీ నెంబర్ సిజి 04ఎన్ ఆర్ 8751 ) లారీ వెళ్తున్న సమయంలో భద్రాచలం వద్ద గోదావరి వారధి పై ఈ ప్రమాదం జరిగింది. కాగా ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే భద్రాచలం సీఐ సంజీవరావు ఎస్ఐ మధు ప్రసాద్ ఇతర పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ

కొత్తగూడెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీలో అమలులో భాగంగా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు వివరాలను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు వివిధ కారణాల వల్ల రుణమాఫీ జమకానీ రైతులు మొత్తం దరఖాస్తులు 5893 కాగా 4230 దరఖాస్తులను అప్‌డేట్ చేశామన్నారు. శుక్రవారం 1663 దరఖస్తులు రైతుల నుంచి స్వీకరించామని ఆయన తెలిపారు.

## స్పర్శలేని మచ్చ పట్ల నిర్లక్ష్యం వద్దు: డీఎంహెచ్‌వో

పాల్వంచ టౌన్, ఆగస్టు 23: శరీరంపై స్పర్శలేని మచ్చల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. జిల్లాలోని లెప్రసీ నోడల పర్సన్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పాల్వంచలోని ఆరోగ్యశిక్షణ కేంద్రంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన కుష్టు వ్యాధిగ్రస్తుల డేటా ఎంట్రీలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కుష్టు వ్యాధి అనేది మైకోబాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుందేని ఈ వ్యాధి సోకిన వారు భయపడాల్సిన పని లేదని తెలిపారు. ఒక క్రమపద్ధతిలో చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వ్యాధికి మందులను పూర్తిగా ఉచితంగా అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లేప్రో సొసైటీ ప్రోగ్రాం అధికారి నర్సింహస్వామి, జిల్లా మెంటర్‌లైప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కళ్యాణ్, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా సీహెచ్ఐ ప్రోగ్రాం అధికారి జి. భద్రు, ఫిజియోథెరపిస్ట్ పి. శ్రీనిఆస్, డీపీఎంవో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి: డీఎస్పీ

మణుగూరు/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 23: ఆటో డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మణుగూరు పోలీసు స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు క్రమశిక్షణ, ట్రాఫిక్ నిబంధనల అవగాహన సమావేశాన్ని నిర్వహించి డీఎస్పీ మాట్లాడారు. డ్రైవర్లు ప్రయాణికుల పట్ల సభ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు వెంటనే తెలపాలన్నారు. ఆటో స్టాండ్ల వద్ద సిరియల్ విధానాన్ని ఏర్పాటు చేసుకుని ప్రయాణికులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్ ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. శుక్రవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లుతో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలుగకుండా ఆటో డ్రైవర్లు సహకరించాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రైవర్ సీటు వెనుకబాగంలో పేరు, ఫోన్ నెంబర్‌ను ప్రయాణికులకు కన్పించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం నిబద్ధత కలిగిన 15 మంది ఆటో డ్రైవర్లను సన్మానించారు. ఈ సదస్సులో లక్ష్మీదేవిపల్లి, త్రీటౌన్ ఎస్ఐలు రమణారెడ్డి, పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి అమ్మవారి పూజలు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: అశ్వారావుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ రకాల పూజలను నిర్వహించారు. ఆలయంలో అష్టోత్తర కుంకుమ పూజలను అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిపారు. ఆలయంలో ఉదయం కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వివిధ రకాల పూజలు జరిపారు. అనంతరం మహాలక్ష్మీ అష్టలక్ష్మి సహిత వరలక్ష్మి అమ్మవార్లను అందంగా అలంకరించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమీటీ బాధ్యులు పాల్గోన్నారు.


అశ్వారావుపేటలో మహిళల పూజలు


జూలూరుపాడులో వ్రత పూజలు చేస్తున్న మహిళలు

### వేణుగోపాలస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు

జూలూరుపాడు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని కాకర్ల గ్రామంలో శ్రీ సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఈ వ్రతాలలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. గ్రామాలలోని మహిళలు తమ ఇళ్లల్లో అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

# భయం భయంగా రాకపోకలు..

- కుక్కలతో బెంబేలెత్తుతున్న జనం
- మూడు నెలల్లో 343 మందికి కుక్కకాటు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 23: అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ అయిన అశ్వారావుపేటలో కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అంతేకాదు.. ఒంటరిగా నడిచి వెళ్లే వారిపై దాడులుకు పాల్పడి గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్డుపైకి వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు చిన్నారులే బాధితులు కావడం విశేషం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారుల వెంటబడి వెంటడించడంతో వారు తల్లడిల్లి పోతున్నారు. గడచిన మూడు నెలల్లో మండల వ్యాప్తంగా 343 మంది కుక్కకాటుకు గురయ్యారు, అశ్వారావుపేట సీహెచ్‌సీలో ఈ ఏడాది మేలో 125 జూన్‌లో 65 జులైలో 102 కుక్కకాటు కేసులు నమోదు కాగా. గుమ్మడివల్లి పీహెచ్‌సీలో మేలో 10 జూన్‌లో 09 జులైలో 02 వినాయకపురం పీహెచ్‌సీలో మేలో 11 జూన్‌లో 08 జులైలో 11 కేసులు నమోదయ్యాయి. కుక్కలు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అశంపై అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తిని వివరణ కోరగా ఈ సమస్యను డీపీవో దృష్టికి తీసుకు వెళ్ళి నివారణ చర్యలు చేపడతామన్నారు.



అశ్వారావుపేటలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

## రేపు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 23 : కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి శ్రీరామ చంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం 5వ జిల్లా స్థాయి యోగాసాన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరి బుట్టి ప్రమీల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల విద్యార్థులతోపాటు ఆసక్తి గల వారందరు పాల్గొనవచ్చని తెలిపారు. వయస్సును బట్టి ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్, ఆర్టిస్టిక్ గ్రూపుల వారీగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000099958, 9247753327 నెంబర్లను సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## రేపు క్రీడా పోటీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు23: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నామని డీవైఎస్‌వో పరందామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ పోటీలను ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ క్రీడా విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల 9515723780, 9440116105, 9949446551 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ పోటీలు ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## గీత కార్మికులకు ఒక్క రోజు శిక్షణ

అశ్వారావుపేట టౌన్ ఆగస్టు 23 పేటలో కాటమయ్య రక్షా కవచ్ కార్యక్రమాంలో భాగంగా గీత కార్మికులకు తాటి చెట్లు ఎక్కడంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణీ ఇందిర మాట్లాడుతూ.. చెట్లెక్కె సమయంలో గీత కార్మికులు ప్రమదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, అంగ వైకల్యం పొందడం జరుగుతుందని అలా జరగకుండా ఉండేందుకే గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన గీత కార్మికులకు త్వరలోనే ఈ రక్షణ కిట్లను అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వర రావు, గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడు ఆరేపల్లి బాబురావు కార్మికులుపాల్గోన్నారు

## రైతులందరికి రుణ మాఫీ చేయాలి

జూలూరుపాడు, ఆగస్టు 23: రుణమాఫీలో నిబంధనలు తొలిగించి రైతులందరికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ స్వాతి బింధుకు అందజేశారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, గడిదేశి కనకరత్నం, లాకావత్ శ్రీను, సుగుణ, గార్లపాటి వెంకటి, మొగలాలి, అభిమిత్ర, పవన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## హత్యాచార ఘటనను నిరసిస్తూ ర్యాలీ

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ శుక్రవారం రాత్రి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన పట్టణ పురవీధుల్లో సాగింది. వ్యవసాయ కళాశాల ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. బాధ్యులపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి బోర్డు ఏర్పాటు

మణుగూరు, ఆగస్టు 23: మణుగూరు రెవెన్యూ గ్రామమైన రాజీవ్‌గాంధీ నగర్‌లో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం తహసీల్దార్ రాఘవ రెడ్డికి తెలిసింది. ఈవిషయంపై శుక్రవారం రెవెన్యూ సిబ్బంది తనికీలు చేయగా కొందరు వ్యక్తులు ఇక్కడ లారీలని పార్కు చేస్తూ స్థల కబ్జాలకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూమి హద్దులను గుర్తించి ఈ స్థలంలో ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, సర్వేయర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించాలి


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పాల్వంచ టౌన్, ఆగస్టు 23: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్రసమితి సభ్యుడు బండి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం శానిటేషన్, పేసెంట్‌కేర్, సెక్యూరిటి కార్మికులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబు, నాయకులు వెంకటేశ్వర్లు, డి. సుధాకర్, యూనియన్ నాయకులు శంకర్, కనకదుర్గ, రాము, పద్మ, నాగలక్ష్మి, కిరణ్, గోపి పాల్గొన్నారు.

## ఆర్ఎంపీల వైద్యం వద్దు

దుమ్ముగూడెం ఆగస్టు 23: జ్వరాలకు ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకోవద్దని దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి పుల్లారెడ్డి సూచించారు. పెదార్లగూడెంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జ్వరాలు వస్తే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లేదా పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. పెదార్లగూడెంలో నిర్వహిస్తున్న రక్తపరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతులు తెచ్చుకునే వరకూ పరీక్షలు నిలిపివేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

### సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సహకారం

మణుగూరు, ఆగస్టు 23: మాజీ కార్మికులు సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి తరుపున తమ వంతు సహకారాన్ని అందిస్తుందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శుక్రవారం పీవీ కాలనీ లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మాజీ కార్మికులు సీఎంపిఎఫ్ పెన్షన్ అధాలత్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజినల్ కమిషనర్ కనకమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సత్వర పరిష్కారం కోసం ఆన్‌లైన్ సేవలను కూడా ఏర్పాటు చేశామని కార్మికులు ఈ సేవల ద్వారా కూడా సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు సలగల రమేష్, సీఎంపిఎఫ్ అధికారి చిరంజీవి, పిబి అవినాష్, సింగు శ్రీనివాసరావు, నాయకులు రాంగోపాల్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.